క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని ఒక కల్యాణమండపం సమీపంలో పేకాట ఆడుతున్న 29 మందిని బుధవారం అర్ధరాత్రి అరెస్ట్ చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 1.24 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వారిపై కేసు చేసినట్లు పోలీసులు చెప్పారు.

శాసనమండలిలో ప్రశ్నించే వారికి ఓటెయ్యండి

ప్రొద్దుటూరు క్రైం : సమస్యలపై శాసన మండలిలో ప్రశ్నించే తమ అభ్యర్థులకు ఓటెయ్యాలని ఏపీటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు తెలిపారు. ఈ నెల 13న జరుగనున్న శాసన మండలి ఎన్నికల సందర్భంగా స్థానిక మానస రెసిడెన్సీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తినరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.. సమావేశంలో ఏపిటీయూసి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బి రామయ్య, రాష్ట్ర కార్యదర్శి పి సుబ్బరాయుడు, పట్టణ నాయకులు వై హరి, కె సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న హేమ బెహన్‌జీ

ప్రొద్దుటూరు కల్చరల్ : మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు పోవాలని వైఎంఆర్ కాలనీలోని ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బ్రహ్మకుమారి హేమ బెహన్‌జీ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. డాక్టర్ ఎం.వరలక్ష్మి, అవోప మహిళా విభాగం అధ్యక్షురాలు మిట్టా భాగ్యలక్ష్మి, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవిలను సన్మానించారు. కార్యక్రమంలో శివలక్ష్మి బెహన్‌జీ, ఓంశాంతిలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ

బద్వేలు : పక్కాగృహాల నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేసుకోవాలని పోరుమామిళ్ల హౌసింగ్ ఏఈ రమేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన పోరుమామిళ్ల సచివాలయం–3 పరిధిలోని లబ్ధిదారులను వారి ఇంటి వద్దనే కలిసి నిర్మాణాలు మధ్యలో నిలిపేశారని, త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. నెలల తరబడి నిర్మాణాలు నిలిపివేసిన వారిని ప్రత్యేకంగా కలిసి వారిని నిర్మాణాలు తిరిగి ప్రారంభించేలా సమాయత్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, సంక్షేమ కార్యదర్శి సిద్దయ్య పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో ప్రతిభ

వైవీయూ : ఈనెల 8న నిర్వహించిన వైవీయూ అంతర్ కళాశాలల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్. మహబూబ్‌చాంద్ ప్రథమస్థానం పొందింది. 64 కేజీల మహిళల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్ట్రాంగ్ ఉమన్ అవార్డు పొందడంపై కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి


ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఈనెల 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి గురువారం పలు విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే సెయింట్ జోసెఫ్ స్కూల్, కేశవరెడ్డి స్కూల్, విద్యాధరి హైస్కూల్, వూటుకూరు వీరయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లి సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధరరెడ్డి, సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగశేషారెడ్డి, తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు నరాల మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజుపాళెం : వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, సచివాల కన్వీనర్ వెలవలి శేఖర్‌రెడ్డి ఓటర్లను కోరారు. మండలంలోని టంగుటూరు, గాదెగూడూరు, కూలూరు, కొట్టాల గ్రామాల్లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గాదెగూడూరు సర్పంచ్ పోలా వరలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎర్రి రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముడియం గౌతమ్‌రెడ్డి, ఎంటీ శివశంకర్‌రెడ్డి, పోలా వెంకటరెడ్డి, రామచంద్రారెడ్డి, కొండారెడ్డి, వెంకటరామిరెడ్డి, సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి, జయరామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


టంగుటూరులో వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేయాలని కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విద్యావంతులు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులంతా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు. వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ తరపున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా హైకోర్టు న్యాయవాది వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కడప సాయిబాబా విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎంవీ రామచంద్రారెడ్డి పోటీ చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బలపరిచిన ఇరువురు అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

నెలాఖరు నాటికి బకాయిలు చెల్లిస్తామని సీఎం హామీ

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలను ఈనెలాఖరు నాటికి చెల్లిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల క్రితమే చెప్పారని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. డీఏ బకాయిలతోపాటు అన్ని చెల్లిస్తామని చెప్పారన్నారు.

కలెక్టర్ చొరవతోనే ఆధునికీకరణ

ఆర్డీఓ శ్రీనివాసులు


ఆధునీకరించిన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు : కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ చొరవతోనే శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయాన్ని కార్పొరేట్ ఆఫీస్‌లా ఆధునీకరించామని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. ఆధునీకరణ పూర్తయిన ప్రొద్దుటూరు తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆర్డీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 120 ఏళ్ల క్రితం బ్రిటిష్ హయాంలో ఈ కార్యాలయాన్ని నిర్మించారన్నారు. వర్షాకాలంలో అధికారులు ఇబ్బందులు పడేవారని తెలిపారు. కలెక్టర్, జేసీ సమస్యను గుర్తించి రూ.16లక్షలు మంజూరు చేయడంతో కార్యాలయాన్ని ఆధునీకరించామన్నారు. మంచి వాతావరణంలో కార్యాలయాలను ఉంచాలనే ఉద్దేశంతో కలెక్టర్, జేసీ జిల్లాలోని అన్ని కార్యాలయాలను ఆధునీకరిస్తున్నారన్నారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లో కొండాపురం మినహా అన్ని తహసీల్దార్ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామని ఆర్డీఓ తెలిపారు. నిర్మాణానికి కృషి చేసిన కింది స్థాయి అధికారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్లు జె.మనోహర్‌రెడ్డి, సుదర్శన్, సతీష్, ఆర్‌ఐ నాగ మోహన్‌రెడ్డి, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల బకాయిలను విడుదల చేయాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ గురువారం ఆర్డీఓ, తహసీల్దారు, ఎస్టీఓలకు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వేరువేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి, కార్యదర్శి కత్తి బ్రహ్మయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ప్రతినెల 1వ తేదీన పెన్షన్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విశ్రాంత ఉద్యోగులకు బకాయిపడ్డ రెండు డీఏలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కోశాధికారి గంగన్న, అసోసియేట్ అధ్యక్షుడు గంజికుంట పుల్లయ్య, గౌరవ సలహాదారుడు పుల్లంరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య, ఉపాధ్యక్షుడు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 16 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు

తహసీల్దార్ నజీర్ అహ్మద్


మాట్లాడుతున్న తహసీల్దార్ నజీర్ అహ్మద్

ప్రొద్దుటూరు : ఈనెల 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టణంలో 16 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడారు. ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి మొత్తం 13,843 పట్టభద్రుల ఓట్లు, 1234 ఉపాధ్యాయ ఓట్లు ఉన్నాయని తెలిపారు. పట్టభద్రుల ఓట్లకు సంబంధించి ఎద్దుల వెంకటసుబ్బమ్మ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, కొత్తి చిన్నవెంకటసుబ్బయ్య ఉన్నత పాఠశాల, రమణ మహర్షి హైస్కూల్, వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఉపాధ్యాయ ఓట్లకు సంబంధించి మైదుకూరు రోడ్డులోని కొత్తి చిన్న వెంకటసుబ్బయ్య హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని సూచించారు.

పరామర్శ

అట్లూరు : మండల కన్వీనర్, మండల సహకారపరపతి సంఘం చైర్మన్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల గుండెకు స్టంట్ వేయించుకోవడంతో గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రమణారెడ్డిలు ఆయనను కలిసి పరామర్శించారు.

నేడు లక్ష్మీపేటలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశామన్నారు. ఇదే క్రమంలో గృహ సందర్శనలో భాగంగా ఇంటింటికి తిరిగి బెడ్‌కు పరిమితమైన దీర్ఘకాలిక రోగులను పరీక్షిస్తామని వైద్యాధికారి చెప్పారు.

14న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 14న ఉదయం కంప్యూటర్ ఆపరేటర్ పోస్టునకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి. సుబ్బలక్షుమ్మ తెలిపారు. కళాశాల పరీక్షల విభాగంలో పనిచేసేందుకు డిగ్రీతో పాటు కంప్యూటర్స్ అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు అర్హతల ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ

పెండ్లిమర్రి : మండలంలోని ఇసుకపల్లె, జీసీపల్లె హైస్కూల్‌లు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను గురువారం డీఈఓ సీ దేవరాజు తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న రాగి జావాకు సంబంధించిన ప్యాకెట్లను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుజాత, హెచ్‌ఎంలు, ఎస్‌ఓ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నిక


ధ్రువపత్రాలను అందిస్తున్న అధికారి సుగుణ

మైదుకూరు : మైదుకూరు రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికలు గురువారం నిర్వహించారు. సహకార శాఖ అధికారి బీపీ సుగుణ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఆ సంఘం అధ్యక్షుడిగా ఆదాం సాహెబ్‌గారి యాకూబ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా ఎ.అబ్దుల్ రెహమాన్ ఎన్నికయ్యారు. మరో 9 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి సహకార శాఖ అధికారి సుగుణ ధ్రువపత్రాలను అందజేశారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సమీర

బద్వేలు అర్బన్ : గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి తెలిపారు. గురువారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఆసుపత్రిలో జరుగుతున్న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమం ద్వారా గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు అందిస్తూ తగు సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రసవ సమయం ముందుగానే తెలియజేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కోటవీధి, సురేంద్రనగర్, గాంధీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి జాతీయ ఆరోగ్య కార్యక్రమంలోని చికిత్సలు ఎలా అమలవుతున్నాయని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు /జోత్స్నస్వర్ణలత, వినయ్‌కుమార్, సౌమ్య, జియావుల్లా, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ వెంకటమ్మ, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

దువ్వూరు : దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధాన మంత్రి మాతృత్వ యోజన పథకంలో భాగంగా గర్భిణులకు డాక్టర్లు సురేష్‌బాబు, సమీర వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. రక్త పరీక్షలు చేయించుకుని హిమోగ్లోబిన్ తక్కువ ఉంటే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను తీసుకోవాలని చెప్పారు. కష్టతరమైన కాన్పులను ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేష్ కుమార్

చాపాడు : గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని గర్భిణులు సురక్షితమైన ప్రసవాలు అయ్యేందుకు ప్రభుత్వం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్పొరేట్ స్థాయి వైద్య పరీక్షలు చేస్తామన్నారు. ప్రతి నెలా నిర్వహించే వైద్య శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని తగిన సూచనలు పాటించాలన్నారు. అనంతరం గర్భిణులందరికీ స్థానిక హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని ఏర్పాటు చేశారు.

వసతి గృహాన్ని సందర్శించిన జడ్జి


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం జెడ్పీ హాల్ సమీపంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత సందర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అనాథలు, అభాగ్యులు, ఇంటి వసతి లేక బహిరంగ ప్రదేశాల్లో నివసించేవారితో పాటు పలు ఇబ్బందులు పడేవారికోసం ప్రభుత్వం ఉచిత నిరాశ్రయుల వసతి గృహాలు ఏర్పాటు చేసిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే అర్హులైన వారు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసి సీనియర్ సిటిజన్లు టోల్ ఫ్రీ నెంబరు 14567పై అవగాహన కలిగించారు. ఉచిత న్యాయ సహాయంతోపాటు ఇతర సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఆమె సూచించారు.

పార్టీ విజయానికి శక్తిమేర పనిచేద్దాం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : మార్చి 13న జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి విజయానికి కృషి చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వీవీ స్వామి కల్యాణ మండపంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ప్రతి పట్టభద్రుని ఓటు, టీచర్ల ఓటు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు వేయించాలని నాయకులకు సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి పట్టభద్రుల ఓటరు, టీచర్లను కలిసి విన్నవించాలన్నారు. 100 శాతం ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా కృషి చేయాలని తెలిపారు. పోల్ అయిన ఓట్లలో 85 శాతం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓట్లు పడేలా నాయకులు పనిచేయాలన్నారు. అభ్యర్థుల విజయానికి శక్తిమేర పనిచేయాలని పార్టీ నాయకులకు, శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, దువ్వూరు మండల సచివాలయ కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


16వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయికృష్ణ

బద్వేలు అర్బన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రచారాలు ఊపందుకున్నాయి. ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసర వీంద్రారెడ్డికి మద్దతుగా గురువారం మున్సిపాలిటీలోని ఆయా సచివాలయాల పరిధిలో ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 14, 16, 17 వార్డుల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ ఆయా వార్డుల ఇన్‌చార్జిలతో కలిసి ప్రచారం నిర్వహించారు. 31, 32 వార్డుల్లో మున్సిపాలిటీ కన్వీనర్ ఈగ యద్దారెడ్డి, కౌన్సిలర్ బండిచెన్నయ్యల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. 12వ వార్డులో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి వార్డు ఇన్‌చార్జితో కలిసి ప్రచారం నిర్వహించారు. 7వ వార్డులో ఆ వార్డు ఇన్‌చార్జి గానుగపెంట రమేష్ బాబు ప్రచారం నిర్వహించారు. 33వ వార్డులో ఆ వార్డు ఇన్‌చార్జి శ్రీనివాస్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు ఓబులేసు ఆధ్వర్యంలో ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమాల్లో ఆయా వార్డుల ఇన్‌చార్జిలు సుబోద్‌రెడ్డి, సరిటాల మౌలాలి, బుజ్జి, తోటనాగేశ్వర్‌రావు, సూర్యనారాయణరెడ్డి, పెంచల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం


చాపాడు: ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

బి.కోడూరు : మండలంలోని మూలవారిపల్లె, ఎం.నరసింహాపురం, మేకవారిపల్లె గ్రామాల్లో గురువారం ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో జెడ్పీటీసీ దావీదు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల జేసీఎస్ మండల ఇన్‌చార్జి పి.నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనరసారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, మూలవారిపల్లె వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ శివారెడ్డిలు పాల్గొన్నారు.

చాపాడులో..

చాపాడు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల చాపాడు మండల కో ఆర్డినేటర్ రామోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం, చెండ్లూరు, భవానీనగర్‌లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇంటి వద్దకు వెళ్లి బ్యాలెట్ నమూనా పత్రాలను పంపిణీ చేసి వెన్నపూసకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పీరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ ప్రసాద్‌రెడ్డి, చాగంరెడ్డి సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, సంజీవరాయుడు, శంకరయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు


నమూనా బ్యాలెట్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు : మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ మద్దతు అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని కాశినాయన మండల కన్వీనర్ నల్లేరు విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ దేవసాని సత్యనారాయణరెడ్డిలు తెలిపారు. గురువారం పోరుమామిళ్లలోని విశ్వనాథరెడ్డి కార్యాలయంలో కాశినాయన మండల నాయకులతో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ ఎన్నికలు 2024 సార్వత్రిక ఎన్నికలకు రెఫరెండంగా భావించి ప్రతిఒక్కరూ జగనన్నకు పేరు తెచ్చేలా ఓట్లు వేయించాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఎన్నికల సమయానికి రప్పించేలా ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాశినాయన మండలంలో అత్యధిక మెజార్టీ సాధించేలా చూడాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

బద్వేలు : వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు ఓటర్లు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని పార్టీ పోరుమామిళ్ల మండల కన్వీనర్ సీఎం బాషా, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డిలు గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాక, నాడు–నేడుతో పాఠశాలలు, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ వసంతరాయలు, నాయకులు రాళ్లపల్లి నరసింహులు, రాజీవ్‌బాషా, హబీబ్, చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీ అందించండి

బద్వేలు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు ఓటర్లు భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి గురువారం పోరుమామిళ్ల మండలంలోని అక్కలరెడ్డిపల్లె, నాగలకుంట్ల, కొత్రపాటిపల్లె, కవలకుంట్ల, తిమ్మారెడ్డిపల్లె, టేకూరుపేటల్లో పాఠశాల సిబ్బందితో ప్రచారం నిర్వహించారు. ఆయనతోపాటు ఉప మండలాధ్యక్షులు చెన్ను రాజశేఖర్, సింగిల్‌విండో అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, గానుగపెంట ఎంపీటీసీ కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. అలాగే సచివాలయాల కన్వీనర్ మండల కో ఆర్డినేటర్, టేకూరుపేట సర్పంచ్ కల్లూరు రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు టేకూరుపేట, తిమ్మారెడ్డిపల్లె, కవలకుంట్ల, ముసల్‌రెడ్డిపల్లె, కొత్రపాటిపల్లెలో ప్రచారం నిర్వహించారు.

12న బలిజలకు ఉచిత వివాహ పరిచయ వేదిక


మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానదీ తీరంలోని బలిజ కళ్యాణ మండపంలో ఈనెల 12న ఆదివారం ఉదయం 10 గంటలకు జీవీఆర్ ఉచిత బలిజకుల వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు అల్లం చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవీఆర్ వివాహ ఉచిత పరిచయ వేదికను 10 చోట్ల నిర్వహించి 300 మందికి వివాహం చేశామన్నారు. వివాహం కాని బలిజ వధూవరులు, వారి తల్లిదండ్రులు ఈ వేదికలో పాల్గొనాలని కోరారు. ఆసక్తి గల వారు తమ బయోడేటా, పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9989046339 సెల్‌నంబర్‌కు సంప్రదించాలని కోరారు. సమావేశంలో బలిజ సంఘీయులు వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, సుబ్రహ్మణ్యం, గురప్ప, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.